క్లుప్తంగా

సంజీవరాయస్వామి సేవలో డీఆర్ఓ

రాజుపాళెం : హనుమజ్జయంతిని పురస్కరించుకుని జిల్లాలో ప్రసిద్ధ పుణ్య క్షేత్రమైన వెల్లాల గ్రామంలోని శ్రీచెన్నకేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వరస్వామిని జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్ గౌడ్ కుటుంబ సమేతంగా స్వాములను దర్శించుకుని పూజలు చేశారు. వారు ఆలయంలోకి రాగానే ఆలయ అధికారులు, అర్చకులు స్వాగతం పలికారు.

మోడల్ స్కూల్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కాశినాయన : మండల కేంద్రమైన నరసాపురంలోని మోడల్ పాఠశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ సౌజన్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 25వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీలు రూ.75లు, ఓసీ, బీసీలు రూ.150లు దరఖాస్తు రుసుము చెల్లించాలన్నారు. విద్యా బోధన ఆంగ్లంలో ఉంటుందని, పూర్తి వివరాలకు 9010793182 నెంబరును సంప్రదించాలని కోరారు.

పేదలకు భోజనం ప్యాకెట్లు పంపిణీ

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక ఎమ్మెల్సీ కార్యాలయంలో ఆదివారం ఎమ్మెల్సీ రమేష్ యాదవ్ సన్నిహితుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు దుగ్గిరెడ్డి రఘునాథరెడ్డి పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి అందరికీ పంపిణీ చేశారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లోని పేదలు, యాచకులకు భోజనం ప్యాకెట్లను పంపిణీ చేశారు. కొనిరెడ్డి శివచంద్రారెడ్డి ఆయిల్ మిల్లులో రఘునాథ్‌రెడ్డి కేక్ కటింగ్ చేసి అందరికి పంచిపెట్టారు. ఎమ్మెల్సీ సోదరుడు ఆర్.ప్రసాద్, కౌన్సిలర్ మురళీధర్ రెడ్డి, కల్లూరు ప్రసాద్‌రెడ్డి, రాముడు, వాసు, కృష్ణారెడ్డి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చట్టవ్యతిరేక పనులు చేస్తే కఠిన చర్యలు



మోడంపల్లె వాసులతో మాట్లాడుతున్న సీఐ ఇబ్రహీం

ప్రొద్దుటూరు క్రైం : చట్టవ్యతిరేక పనులు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని టూ టౌన్ సీఐ ఇబ్రహీం హెచ్చరించారు. స్థానిక మోడంపల్లెలో ఆదివారం టూ టౌన్ పోలీసులు కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ చేశారు. అనుమానిత ప్రాంతాల్లోని ఇళ్లలో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా పలువురికి సీఐ కౌన్సిలింగ్ ఇచ్చారు. మట్కా, క్రికెట్ బెట్టింగ్, పేకాట ఆడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. గొడవలు పడొద్దని ఏదైనా సమస్య వస్తే స్టేషన్‌కు రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రెడ్డిసురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ట

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక వసంతపేటలోని కోదండరామస్వామి ఆలయంలో ఆదివారం విగ్రహ ప్రతిష్ట ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. దేవతా మూర్తులకు విశేష పూజా కార్యక్రమాలు, అభిషేకాలు చేశారు. సీతారాములు, లక్ష్మణ, ఆంజనేయస్వామి, శివపార్వతులు, నందీశ్వరుడు, నాగదేవత, వినాయక విగ్రహాలకు ప్రతిష్ట మహోత్సవాన్ని వేద పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం కుంభాభిషేకాన్ని నిర్వహించి సీతారాముల శాంతి కల్యాణాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి వేడుకల్లో పాల్గొని స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. సోమవారం రాష్ట్రస్థాయి ఒంగోలు జాతి ఎద్దుల బండలాగుడు పోటీలను నిర్వహించనున్నట్లు కోదండరామస్వామి ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

ఘనంగా మాతృ దినోత్సవం

ప్రొద్దుటూరు : స్థానిక అవోప కార్యాలయంలో ఆదివారం అంతర్జాతీయ మాతృ దినోత్సవాన్ని అవోపా ప్రెసిడెంట్ గుండా పద్మనాభయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబటి శమంతకమణి, పడుచూరి లక్ష్మీకాంతమ్మలను ఘనంగా సన్మానించారు. ముడియం కృష్ణమూర్తి, సుబ్బరత్నమ్మ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ముడియం బద్రినారాయణ, ముడియం జగదీష్ సహకారంతో విద్యార్థులచేత తల్లిదండ్రులకు పాదపూజ కార్యక్రమం వేదమంత్రోచ్చారణలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అవోపా సెక్రటరీ సుంకు వెంకటసుబ్బయ్య, ట్రెజరర్ మాలేపాటి సుబ్రహ్మణ్యం, ఆర్గనైజింగ్ సెక్రటరీ రాజా వెంకట వరలక్ష్మి, జాయింట్ ట్రెజరర్లు, సభ్యులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ట్యాలీలో ఉచిత శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్: నగరంలోని ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ట్యాలీ, కంప్యూటర్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ కో–ఆర్డినేటర్ హరిప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. టెన్త్, ఇంటర్, డిప్లొమో,డిగ్రీ పాస్, ఫెయిల్ అయిన అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. 18–26 ఏళ్ల లోపు కలిగిన వారు అర్హులు.35 రోజుల పాటు శిక్షణ ఉంటుంది. వివరాలకు 90004 87423 నెంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో హనుమజ్జయంతి వేడుకలు



27హోమ గుండాలలో హనుమత్ హోమం చేస్తున్న భక్తులు



హోమం చేస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు కల్చరల్ : మండల పరిధి నరసింహాపురంలో ఆదివారం హనుమత్ జయంతి పురస్కరించుకుని చిన్మయమిషన్ ఆధ్వర్యంలో ఘనంగా హనుమత్ హోమాన్ని నిర్వహించారు. హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. బాలవిహార్ క్యాంప్‌లో శిక్షణ చిన్నారులతో మాతృ, పితృపూజలను నిర్వహించారు. లోకకల్యాణార్థం గణపతి, నవగ్రహ, శాంతి, హనుమత్ హోమాలను 27 హోమ గుండాలు 108 మంది దంపతులతో సామూహికంగా నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. ఆంజనేయస్వామి మహిమలను, కార్యదీక్షను, గొప్పతనాన్ని చిన్మయామిషన్ నిర్వాహకురాలు బ్రహ్మచారిణి రచనాచైతన్య భక్తులకు వివరించారు. ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి హనుమత్ హోమంలో పాల్గొని ప్రత్యేక పూజలను నిర్వహించారు. చిన్మయ మిషన్‌అధ్యక్షుడు పల్లేటి ప్రభాకర్‌రెడ్డి, ఎగ్జిక్యూటివ్ మెంబర్లు, భక్తులు పాల్గొన్నారు.

పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో...

పెన్నానదీ తీరంలోని శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో ఆదివారం హనుమత్ జయంతి సందర్భంగా ప్రత్యేక పూజాకార్యక్రమాలను నిర్వహించారు. టీటీడీ పాలకమండలి సభ్యుడు టంగుటూరు మారుతి ప్రసాద్ దంపతులు స్వామివారిని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఈ సందర్భంగా అన్నప్రసాద వినియోగం జరిగింది.

ఉత్సాహంగా బైక్‌ర్యాలీ

విశ్వహిందూ పరిషత్, భజరంగదళ్, వివేకానంద సేవాసమితి ఆధ్వర్యంలో ఆదివారం హనుమత్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక శ్రీకృష్ణ గీతాశ్రమం నుంచి పెద్ద ఎత్తున బైక్ ర్యాలీ చేశారు. గీతాశ్రమం నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ గాంధీరోడ్డు, రామేశ్వరం, మిట్టమడివీధి, బొల్లవరం ఆంజనేయస్వామి ఆలయం, వైఎంఆర్ కాలనీ, రాజీవ్ సర్కిల్, మైదుకూరు రోడ్డుల మీదుగా టూటౌన్ పోలీస్‌స్టేషన్ సమీపంలోని ఆంజనేయ స్వామి ఆలయం వరకు కొనసాగింది. భక్తులు తమ వాహనాలకు కాషాయ జెండాలను కట్టుకుని జై శ్రీరామ్, జై హనుమాన్ అంటూ నినాదాలు చేసుకుంటూ ఈ బైక్‌ర్యాలీలో పాల్గొన్నారు. ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించి ప్రసాద వినియోగం చేశారు. విశ్వహిందూ పరిషత్, భజరంగదళ్, వివేకానంద సేవాసమితి, పలు ఆలయాల, కుల సంఘాల ప్రతినిధులు, హిందువులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ప్రతాపమారుతిస్వామికి ప్రత్యేక పూజలు

ప్రొద్దుటూరు : మండలంలోని ఉప్పరపల్లె గ్రామంలోని సద్గురు సమర్థనారాయణ స్వామి ఆశ్రమంలో వెలసిన శ్రీ ప్రతాప మారుతిస్వామికి హనుమత్ జయంతి సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం స్వామివారికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, హనుమాన్ చాలీసా పారాయణం, హనుమత్ ప్రదక్షిణ, రామనామజపం నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. అనంతరం మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం జరిగింది.

రాజుపాళెం : మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం హనుమజ్జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వెల్లాల గ్రామంలోని శ్రీచెన్నకేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వర స్వాములకు వేదపండితులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. సాయంత్రం ఒంటె వాహనంపై సంజీవరాయస్వామిని ఆలయ మాడ వీధుల్లో అంగరంగ వైభవంగా ఊరేగించారు. అలాగే వెలవలి గ్రామంలోని అభయాంజనేయ స్వామికి, టంగుటూరు గ్రామంలోని ఆంజనేయస్వామి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ చైర్మన్ కానాల విజయలక్ష్మి, సర్పంచ్ కానాల రాధ, దామోదర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు కానాల బలరామిరెడ్డి, ఈఓ బీవీ నరసయ్య,, అర్చకుడు విజయవర్ధన్‌రావు పాల్గొన్నారు.

మైదుకూరులో..

మైదుకూరు : మైదుకూరులో ఆదివారం హనుమజ్జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక లక్ష్మీ మాధవరాయ స్వామి ఆలయంలోని ఆంజనేయస్వామికి వెండి ఆభరణాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. నానుబాలపల్లె రోడ్డులో ఉన్న ఆంజనేయనగర్ అభయాందజనేయస్వామి ఆలయంలో పల్లె ఆంజనేయులరెడ్డి, పల్లె నడిపి గురివిరెడ్డి సోదరుల ఆధ్వర్యంలో హనుమజ్జయంతిని కన్నుల పండువగా నిర్వహించారు.

ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో..

పట్టణంలోని అంకాలమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలో అంకాలమ్మ రాష్ట్ర సేవిక సమితి ఆధ్వర్యంలో హనుమజ్జయంతి వేడుకలు రెండో రోజు ఘనంగా నిర్వహించారు. స్థానిక నంద్యాల రోడ్డులోని కోదండరామస్వామి ఆలయం నుంచి పెద్ద సంఖ్యలో మహిళలు కలశాలతో అంకాలమ్మ తల్లి ఆలయం వద్దకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ వేదికపై ఆంజనేయస్వామి ఉత్సవ విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు కలశ పూజలో పాల్గొని హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. అనంతరం అచలానంద స్వామి పీఠాధిపతి విరజానంద స్వామి, ఆర్ఎస్ఎస్ విభాగ్ బౌద్ధిక్ బలరాంజీ, విజయలక్ష్మి తదితరులు హిందూ ధర్మం, రామాయణంలో హనుమంతుని విశిష్టతను వివరించారు.

దువ్వూరు : మండల వ్యాప్తంగా ఆదివారం హనుమజ్జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. పాత దువ్వూరులోని శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో స్వామివారికి పంచామృతాభిషేకం, ఆకుపూజ చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని కాయకర్పూరం సమర్పించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

పవన సుతునికి ఘన నీరాజనాలు

బద్వేలు అర్బన్ : అనుపమ విక్రమార్కుడు, శ్రీరాముడి నమ్మినబంటు, పవనసుతుడైన హనుమంతుని జయంతిని ఆదివారం వాడవాడలా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా ఆలయాలలోని ఆంజనేయస్వామి విగ్రహాలను సుందరంగా అలంకరించారు. స్థానిక పోరుమామిళ్ల రోడ్డులోని దిగువ బ్రాహ్మణవీధిలో మారుతి భజన మండలి ఆధ్వర్యంలో నిర్మించిన ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారికి ఆకుపూజ, అభిషేకం నిర్వహించారు. ఈ ఆలయంలోని 49 అడుగుల ఆంజనేయస్వామి విగ్రహాన్ని సుందరంగా అలంకరించారు. ఫైర్ ఆఫీసు వెనుకభాగంలోని శ్రీగోదాదేవి సహిత వెంకటేశ్వరస్వామి, ఆంజనేయస్వామి ఆలయంలో పంచామృతాభిషేకం, హనుమాన్ వ్రతం ఘనంగా నిర్వహించారు. అలాగే బైపాస్‌రోడ్డులోని సంజీవ ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి హనుమాన్ భక్తులు పట్టణంలో బైక్‌ర్యాలీ నిర్వహించి సాయంత్రం గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామోత్సవం వెంట ఏర్పాటు చేసిన కోలాటం భక్తులను ఆకట్టుకుంది. నెల్లూరు రోడ్డులోని పురాతన అభయాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అలాగే ఆంజనేయనగర్, రాజుగారివీధి, నాగులకట్ట శివాలయం వద్దగల ఆంజనేయస్వామి ఆలయం, గాండ్లవీధిలోని అభయాంజనేయస్వామి ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. ఆయా ఆలయాలలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

గోపవరం : మండలంలోని రాచాయపేటలో అభయాంజనేయస్వామి ఆలయంలో ఆదివారం హనుమాన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని కాయకర్పూరం సమర్పించుకున్నారు. ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందజేశారు.

చాపాడు: మండల పరిధిలోని చాపాడు, విశ్వనాథపురం, తిప్పిరెడ్డిపల్లె, పల్లవోలు గ్రామాలలో ఆదివారం ఘనంగా హనుమజ్జయంతి వేడుకలను నిర్వహించారు. చాపాడు సమీపంలోని వీరాంజనేయ స్వామి దేవాలయం వద్ద ఉదయం నుంచి సాయంత్రం ప్రత్యేక పూజలు చేస్తూ భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఇదే క్రమంలో మైదుకూరు–ప్రొద్దుటూరు జాతీయ రహదారి పక్కన విశ్వనాథపురం వద్ద గల వీరాంజనేయుడి సన్నిధిలో ప్రత్యేక పూజలతో పాటు గ్రామోత్సవ వేడుకలు నిర్వహించారు. ఇదే క్రమంలో తిప్పిరెడ్డిపల్లె వీరాంజనేయుడి సన్నిధిలో పూజలతో పలు రకాలైన సాంస్కృతిక కార్యక్రమాలతో భక్తులకు అన్నదానం చేశారు. పల్లవోలు గ్రామంలో ఆంజనేయుడి సన్నిధిలో గ్రామస్థులు పూజలు నిర్వహించారు.

నేడు బండలాగుడు పోటీలు..

మండలంలోని విశ్వనాథపురం గ్రామంలోని వీరాంజనేయుడి సన్నిధిలో హనుమజ్జయంతి వేడుకల సందర్భంగా సోమవారం బండలాగుడు పోటీలు నిర్వహించనున్నారు. ఈ పోటీలలో గెలుపొందిన ఎద్దుల ఎజమానులకు వరుసగా రూ.60 వేలు, రూ.50 వేలు, రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు చొప్పున నగదు బహుమతులు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



ప్రత్యేక అలంకరణలో వీరాంజనేయ స్వామి



ప్రత్యేక అలంకరణలో అభయాంజనేయస్వామి



రాజుపాళెం: టంగుటూరులో ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న అర్చకులు



సంజీవ ఆంజనేయస్వామి ఆలయం గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు



హనుమత్ జయంతి సందర్భంగా బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



కలశ పూజలో పాల్గొన్న మహిళలు

సీఎం సహాయనిధి పేదలకు వరం లాంటిది



సీఎం సహాయనిధి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే

బద్వేలు అర్బన్ : ఆపదలో ఉన్న నిరుపేదలకు సీఎం సహాయనిధి వరం లాంటిదని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధలు పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 17వ వార్డులోని నూర్‌బాషాకాలనీకి చెందిన జీ.ముంతాజ్‌కు మంజూరైన రూ.2.24 లక్షల చెక్కును ఆదివారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రం ఆర్థిక లోటులో ఉన్నప్పటికీ ఏ ఒక్క పేద, మధ్యతరగతి ప్రజలు ఇబ్బంది పడకూడదన్న ఉద్దేశ్యంతో దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికి సహాయం చేస్తున్నారన్నారు. కుటుంబ పెద్దను కోల్పోయిన, అనారోగ్యంతో బాధపడుతున్న పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ఎంతగానో దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ బూత్‌కన్వీనర్ల సమన్వయకర్త కె.రమణారెడ్డి, సివిల్‌సప్‌లెస్ట్ కార్పొరేషన్ డైరెక్టర్ సుందర్‌రామిరెడ్డి, గిద్దలూరు అసెంబ్లీ ఎన్నికల పరిశీలకులు బంగారుశీనయ్య, మున్సిపల్ వైస్‌చైర్మన్ ఆర్.వి.సాయిక్రిష్ణ, వైఎస్సార్ సీపీ మున్సిపాలిటీ కన్వీనర్ యద్దారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పుత్తాలక్ష్మిదేవిశ్రీరాములు, మాజీ మున్సిపల్ చైర్మన్ డాక్టర్ బి.మునెయ్య, వార్డు కౌన్సిలర్ డి.సత్యనారాయణ, జయరాంయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రసవత్తరంగా బండలాగుడు పోటీలు

కమలాపురం : పట్టణంలోని చెరువు కట్టపై వెలసిన శ్రీ వరాల సుంకులమ్మ అష్టమ తిరునాల మహోత్సవాన్ని పురస్కరించుకు ఏర్పాటు చేసిన బండలాగుడు పోటీలు పోటా పోటీగా సాగాయి. ఆదివారం నిర్వహించిన సీనియర్ కేటగిరి బండ లాగుడు పోటీలను ఆర్టీసీ చైర్మన్ దుగ్గాయపల్లె మల్లికార్జునరెడ్డి ప్రారంభించారు. రాష్ట్రం లోని వివిధ జిల్లాల నుంచి వచ్చిన ఎడ్లు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. బాపట్ల జిల్లా చుండూరు మండలం వేటపాలెంకు చెందిన శిరీషా చౌదరి, శివకృష్ణ చౌదరి ఎడ్లు అత్యధికంగా 2164 అడుగులు రాతిదూలాన్ని లాగి ప్రథమ స్థానంలో నిలిచాయి. అలాగే రంగారెడ్డి జిల్లా బాలాపూర్‌కు చెందిన ప్రసన్నరెడ్డి కంబైన్డ్ నంద్యాల జిల్లా ప్యాపిలికి చెందిన శ్రీరాములు యాదవ్ ఎడ్లు 1927 అడుగులతో ద్వితీయ స్థానంలో నిలిచాయి. నంద్యాల జిల్లా డోన్‌కు చెందిన గురునాథ్ ఎడ్లు 1759 అడుగులతో తృతీయ స్థానంలో, బాపట్ల జిల్లా బల్లి కురువకు చెందిన పావులూరి వీరస్వామి చౌదరి, ప్రకాశం జిల్లా రాచర్లకు చెందిన బాలరాజు ఎడ్లు 1500 అడుగులతో నాల్గవ స్థానంలో, బాపట్ల జిల్లా బల్లికురువకు చెందిన పావులూరి వీరా స్వామి చౌదరి ఎడ్లు 1338 అడుగులతో ఐదవ స్థానంలో, నంద్యాల జిల్లా ప్యాపిలికి చెందిన చిన్న నాగన్న, అనంతపురం జిల్లా గుంతకల్లుకు చెందిన జయరామిరెడ్డి కంబైన్డ్ ఎడ్లు 1269 అడుగులతో ఆరవ స్థానంలో నిలిచాయి. వారికి వరుసగా రూ.1.50లక్షలు, రూ.1లక్ష, రూ.75వేలు, రూ.50వేలు, రూ.25వేలు, రూ.15వేలు నగదు బహుమతులు అందజేశారు.

నేటి నుంచి గ్రామ సచివాలయాల్లో స్పందన కార్యక్రమం

గోపవరం : మండల కేంద్రంలో ప్రతి సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమాన్ని ఇకమీదట గ్రామ సచివాలయాల్లో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ హరినారాయణ తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం సచివాలయాల్లో స్పందన కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ మేరకు ఆగస్టు 3వ తేదీ వరకు సచివాలయాల్లో నిర్వహించే స్పందన కార్యక్రమాల వివరాలు ఇలా ఉన్నాయి. 15వ తేదీ సోమవారం గోపవరం సచివాలయం, 18వ తేదీ గురువారం బేతాయపల్లె, 22న రాచాయపేట, 25న టీ.సండ్రపల్లె, 29న బ్రాహ్మణపల్లె, జూన్ 1న కాలువపల్లె, జూన్ 5న గోపవరం, 8న బేతాయపల్లె, 12న రాచాయపేట, 15న టీ.సండ్రపల్లె, 19న బ్రాహ్మణపల్లె, 22న కాలువపల్లె, 26న గోపవరం, జూలై 3న బేతాయపల్లె, 6న రాచాయపేట, 10న టీ.సండ్రపల్లె, 13న టీ.సండ్రపల్లె, 17న కాలువపల్లె, 20న గోపవరం, 24న బేతాయపల్లె, 27న రాచాయపేట, 31న టీ.సండ్రపల్లె, ఆగస్టు 3వ తేదీన బ్రాహ్మణపల్లె సచివాలయాల్లో స్పందన కార్యక్రమం ఉంటుందన్నారు.

21న దూదేకుల విద్యార్థులకు ప్రోత్సాహకం

కడప రూరల్: పదో తరగతి, ఇంటర్‌మీడియట్ పరీక్షల ఫలితాల్లో ప్రతిభ చాటిన నిరుపేద దూదేకుల విద్యార్థులకు ఈ నెల 21వ తేదీన ప్రోత్సాహక బహుమతులను అందిస్తున్నట్లు నూర్ బాష్ దూదేకుల ముస్లిం సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గగ్గుటూరు రాజా, గౌరవ సలహాదారులు ఆయిల్ మిల్ ఓబులేసు తెలిపారు. ఆదివారం స్థానిక ఆ సంఘం జిల్లా కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు 10వ తరగతిలో 550, ఇంటర్‌మీడియట్‌లో 900 మార్కులకు పైగా సాధించిన దూదేకుల విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను అందజేస్తామన్నారు. ఈ నెల 19వ తేదీలోపు అర్హులైన విద్యార్థులు మార్కుల జాబితాను కడప ఎర్రముక్కపల్లెలో గల దూదేకుల భవన్‌లో అందజేయాలన్నారు. అర్హులైన విద్యార్థులకు ఈ నెల 21వ తేదీన దూదేకుల భవన్‌లో మధ్యాహ్నం 3 గంటలకు ప్రోత్సాహక సత్కారం కార్యక్రమం ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు సెల్ నంబర్ 9652221967 ను సంప్రదించాలని తెలిపారు.

ఎమ్మెల్యేకు వినతి

కలసపాడు : 104 ఎంఎంయూ వాహన ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, నేరుగా కాంట్రాక్ట్/ఏపీసీఓఎస్‌లో అబ్జార్బ్ చేయాలని కోరుతూ ఆదివారం ఏపీ 104 ఎంఎంయూ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు ఎమ్మెల్యే డాక్టర్ సుధకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు ఇంటి ముంగిటనే మెరుగైన వైద్యసేవలు అందాలనే ఉద్దేశ్యంతో దివంగత మహనేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 2008లో 104 వాహన సేవలను ప్రారంభించారని, వైఎస్ జగన్‌మోహన్ ప్రజా సంకల్పయాత్రలో అధికారంలోకి వచ్చిన తర్వాత 104 వాహన ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పిస్తామని, వేతనాల పెంపు అమలు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ విధానం విజయవంతంగా నిర్వహించడంలో కీలకపాత్ర పోషిస్తున్న డ్రైవర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్ల ఉద్యోగులను ముఖ్యమంత్రి హామీ మేరకు ఉద్యోగ భద్రత కల్పించాలని, నేరుగా కాంట్రాక్ట్/ఏపీసీఓఎస్‌లో అబ్జార్బ్ చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఏపీ 104 ఎంఎంయూ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు పి.బ్రహ్మానందరెడ్డి, ఎస్.రవీంద్రబాబు, బి.వెంకటకుమార్, డి.ఓబులయ్య, చెన్నయ్య, ఎస్.రాజేష్, పి.ఓబయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐ బాధ్యతల స్వీకరణ

ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరు వన్‌టౌన్ ఎస్ఐగా అమర్‌నాథ్‌రెడ్డి ఆదివారం బాధ్యతలు తీసుకున్నారు. కడప చిన్నచౌక్ స్టేషన్‌లో పని చేస్తూ ఇక్కడికి బదిలీ అయ్యారు. 2012 బ్యాచ్‌కు చెందిన అమర్‌నాథ్‌రెడ్డి జిల్లాలోని పలు స్టేషన్లలో పని చేశారు. స్టేషన్ పరిధిలో సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటానని ఎస్ఐ ఈ సందర్భంగా తెలిపారు.

20న బంగ్లే షావలి ఉరుసు

కడప కల్చరల్ : కడప గండి వాటర్‌వర్క్స్ వద్దగల హజరత్ ఖ్వాజా సయ్యద్‌షా అబ్దుల్ ఖాదర్ హుసేనీ చిష్తివుల్ ఖాద్రి రహమతుల్లా అలై ఉరఫ్ బంగ్లే షావలి ఉరుసు ఈనెల 20న నిర్వహించనున్నట్లు పెద్దదర్గా ముజావర్ అమీర్ తెలిపారు. ఉత్సవంలో భాగంగా ఆస్తానె మగ్దూమ్ ఇలాహి అమీన్‌పీర్ (పెద్ద) దర్గా సజ్జాద నషీన్ హజరత్ ఖ్వాజా సయ్యద్‌షా ఆరీఫుల్లా మహమ్మద్ మహమ్మదుల్ హుసేనీ సాహెబ్ ఇంటి నుంచి గంధం కలశాన్ని ఫకీర్ల మేళతాళాల మధ్య గండి గ్రామంలో ఊరేగింపుగా వెళ్లి దర్గాకు చేర్చనున్నట్లు తెలిపారు. అనంతరం గంధాన్ని గురువుల మజార్‌పై సమర్పించి ఫాతెహా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా రాత్రి 9 గంటలకు ప్రముఖ ఖవ్వాలీ గాయకుల కచేరీ ఉంటుందని తెలిపారు.

ఆలోచనలు రేకెత్తించే క్రీడలు ఆడాలి

కమలాపురం : విజ్ఞానం, ఆలోచనలు రేకెత్తించే క్రీడలు, ఆటలు ఆడాలని కమలాపురం శాఖ గ్రంథాలయాధికారి నాగాంజలి తెలిపారు. స్థానిక గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన సదస్సులో భాగంగా ఆదివారం విజ్ఞానం, ఆలోచనలు రేకెత్తించే క్యారమ్స్ తదితర ఆటల్లో ఆమె విద్యార్థులకు శిక్షణ నిచ్చారు.

విద్యార్థులకు చిత్రలేఖనంలో పోటీలు



పోటీలను పర్యవేక్షిస్తున్న ఆఫ్రిది

పోరుమామిళ్ల : పట్టణంలోని గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులకు జేవీవీ జిల్లా కార్యవర్గసభ్యుడు ఖాశింవలి సమ్మర్ క్యాంప్‌లో భాగంగా చిత్రలేఖనంలో పోటీలు నిర్వహించారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు ఉత్సాహంగా తమ అభిరుచికి తగ్గట్లు బొమ్మలు వేశారు. ఈ సందర్భంగా ఖాశింవలి మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించేందుకు పోటీలు నిర్వహించామని, పోటీల్లో పాల్గొన్న వారిని సీనియర్, జూనియర్ విభాగాలుగా చేసి మంగళవారం విజేతలకు బహుమతులు ఇస్తామన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి ఆఫ్రిది, రాష్ట్రపతి అవార్డు గ్రహీత దాదాపీర్ పాల్గొన్నారు.

విద్యతో పాటు నైతిక విలువలు అవసరం



విద్యార్థినికి నగదు బహుమతి అందిస్తున్న ఈశ్వరరెడ్డి, హరినారాయణ తదితరులు

ప్రొద్దుటూరు కల్చరల్ : విద్యార్థులు చదువుతో పాటు నైతిక విలువలను అలవర్చుకోవాలని యోగి వేమన యూనివర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ఎన్.ఈశ్వర రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని మధురసాయి ఐటీ అండ్ మేనేజ్‌మెంట్ కళాశాలలో ఆదివారం వెంకటేశ్వర డిగ్రీ కళాశాల 18వ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఈశ్వర్ రెడ్డి మాట్లాడుతూ కళాశాలకు త్వరలో న్యాక్ గుర్తింపు వస్తుందని పేర్కొన్నారు. విద్యార్థులు నిరాశను వదిలిపెట్టి విజయం కోసం కష్టపడాలని సూచించారు. కరస్పాండెంట్ హరినారాయణ మాట్లాడుతూ 2005లో కళాశాల ప్రారంభమైనప్పటి నుంచి విద్యార్థుల విద్యాభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నామన్నారు. అనంతరం చదువులో ప్రతిభ కనపరచిన విద్యార్థులకు నగదు బహుమతులను అందచేశారు. నారాయణ ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు లక్ష్మినారాయణ, వైవీయూ పాలకమండలి సభ్యుడు సుబ్బారెడ్డి, పరమేశ్వర డిగ్రీకళాశాల కరస్పాండెంట్ నాగేశ్వరరెడ్డి, ప్రిన్సిపాల్ ముస్తఫా, ఎన్‌సీసీ కో ఆర్డినేటర్ గౌరీశంకర్, వైస్ ప్రిన్సిపాల్ భవాని, ఇన్‌చార్జి ప్రినిపాళ్లు శ్రీకాంత్ రెడ్డి, రాంమోహన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

చుక్కల భూముల నుంచి రైతులకు విముక్తి

చాపాడు : దశాబ్దాలుగా రైతులు చుక్కల భూములతో పడుతున్న సమస్యలకు పరిష్కారం చూపుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న చర్య హర్షనీయమైనదని రాష్ట్ర ఉద్యానశాఖ ప్రభుత్వ సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలతో పేర్కొన్నారు. చుక్కల భూములను 22–ఏ నిషేధిత జాబితా నుంచి తొలగించి రైతులకు పూర్తి హక్కులు కల్పించటం జరుగుతుందన్నారు. రెవెన్యూ రికార్డులలో ఏదో ఒక దానిలో రైతు పేరు నమోదు అయి ఉండటం, రైతు వద్ద పట్టాదారు పాసుపుస్తకం ఉండటం, రైతు వద్ద వంశపారంపర్య దస్తావేజులు లేదా రాసుకున్న అగ్రిమెంట్లు, రైతు 2017కు ముందు 12 ఏళ్ల భూమి సాగుదారుడిగా ఉండటం ఇంకా పలు రకాలైన అనుభవదారులైన రైతులకు చెందిన చుక్కల భూములను పట్టా భూములుగా మారతాయన్నారు. దశాబ్దాలుగా ఏ ప్రభుత్వం తీసుకోనటువంటి గొప్ప నిర్ణయాన్ని సీఎం వైఎస్ జగన్ తీసుకున్నారన్నారు.

ముగిసిన సుంకులమ్మ తిరునాల

కమలాపురం : పట్టణ పరిధిలోని చెరువు కట్టపై వెలసిన శ్రీ వరాల సుంకులమ్మ తిరునాల ఘనంగా ముగిసింది. ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో మూడు రోజులుగా జరుగుతున్న సుంకులమ్మ అష్టమ బ్రహ్మోత్సవ తిరునాల మహోత్సవం ఆదివారం వైభవంగా ముగిసింది. ఉదయం ప్రాతఃకాల పూజలతో కార్యక్రమాలు ప్రారంభించారు. ప్రముఖ వేద పండితులు సరసా శివకుమార్ శర్మ, నాగళయన శర్మ ఆచారత్వమున అమ్మవారికి అభిషేకాలు, మంగళ హారతి, రుద్ర హోమము, పూర్ణాహుతి, కుష్మాండబలి, కక్షజ్వాల, మహా ప్రసాద నివేదనము, మహా మంగళ హారతి, తీర్థ ప్రసాద వినియోగం నిర్వహించారు. భక్తులకు చవ్వారెడ్డి రామసుబ్బారెడ్డి కుటుంబ సభ్యులు అన్నదానం ఏర్పాటు చేశారు. అనంతరం ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి గ్రామోత్సవంలో పెద్ద ఎత్తున బాణా సంచా పేల్చుతూ డప్పు వాయిద్యాల నడుమ యువత నృత్యాలు చేశారు. తిరునాల మహోత్సవాన్ని పురస్కరించుకుని ఆర్టీసీ చైర్మన్ దుగ్గాయపల్లె మల్లికార్జునరెడ్డి, రాష్ట్ర పరిశ్రమల శాఖ సలహాదారుడు రాజోలి వీరారెడ్డి, మాజీ ఎమ్మెల్యే వీరశివారెడ్డి, డీసీసీబీ మాజీ అధ్యక్షుడు అనిల్‌కుమార్‌రెడ్డి ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.